శాతవాహన అనంతరీకులు

శాతవాహన వంశం అస్తమించడంతో ఆంధ్రజాతికి వారు ప్రసాదించిన రాజకీయ సమైక్యం విచ్ఛిన్నమయింది. ఆంధ్రదేశం భిన్న ప్రాంతాల్లో భిన్న రాజవంశాలు చిన్న చిన్న రాజ్యాలు స్థాపించి సుమారు పదో శతాబ్దం వరకు పాలించినారు. తమ వంశం సుస్థిరంగా ఉన్న కాలంలోనే శాతవాహనులు వేర్వేరు ప్రాంతాలలో సామంత రాజవంశాలను నెలకొల్పినట్లు పురాణాలు చెబుతున్నాయి వారిలో ఆంధ్రులు, ఆభీరులు, ఆంధ్రభృత్యులు ముఖ్యులు. ఆంధ్రేతరులేగాక విదేశీయులైన ఆభీరులు పశ్చిమోత్తర దక్షిణావథంలో ప్రబలులయినారు. శాతకర్ణి బిరుదం ధరించినందున చుటుకులులను ఆంధ్రశాతవాహన వంశశాఖగా వరిగణించవచ్చు. వీరు కర్ణాట దేశాన్ని పాలించినారు. ఇక శ్రీపార్వతీయ ఆంధ్రభృత్యపదాలు రెండూ మత్స్యపురాణంలో కన్పిస్తున్నందున ఆంధ్రభృత్యులే శ్రీపార్వతీయులుగా అంగీకరించవచ్చు. వీరు ఆంధ్ర సామ్రాజ్యానికి ఆయువుపట్టుగా నుండిన కృష్ణా ముఖద్వారానికి ఇరువైపులనున్న రాజ్యాన్ని ఆక్రమించి నాలుగైదు తరముల కాలం పాలించినారు.

ఇక్ష్వాకులు

పురాణాలు పేర్కొన్న శ్రీపార్వతీయులను గుర్తించడం చాలకాలం వరకు కష్టసాధ్యమయింది. కాని నాగార్జునకొండ శాసనాల్లో శ్రీచాంతమూలుడు ఇక్ష్వాకు కులజుడని అతని రాజధాని అయిన విజయపురి శ్రీపర్వత పశ్చిమ పాదంలో ఉన్నదని పేర్కొనడం వల్ల శ్రీపార్వతీయులను గుర్తించడం సులభమయింది. శాతవాహనులను ఆంధ్రులని వర్ణించినట్లే శ్రీపర్వత ప్రాంతీయులైన ఇక్ష్వాకులను శ్రీపార్వతీయులుగా పురాణాలు వర్ణించినాయి.

జన్మస్థలం

ఇక్ష్వాకుల జన్మస్థలాన్ని గురించి అభిప్రాయ భేదాలున్నాయి. నామసామ్యాన్ని బట్టి ఇతిహాస కాలంలో కోసల రాజ్యాన్ని పాలించిన ఇక్ష్వాకు వంశంతో శ్రీపార్వతీయులకు సంబంధం కలపడానికి ప్రయత్నించడం సహజం. అదీగాక విష్ణు పురాణము జైన ధర్మామృతము ఇక్ష్వాకు రాకుమారులు దక్షిణావథానికి వలస వచ్చి రాజ్యాలు స్థాపించినట్లు చెబుతున్నాయి గదా!